క్లుప్తంగా

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

వేలేరు : సైబర్ నేరాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై అజ్మీర సురేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు నుంచి ఫోన్లు వస్తే స్పందించ కూడదని అన్నారు. బ్యాంక్ ఖాతా నంబర్లు, ఓటీపీలు, ఇతర వివరాలు అడిగితే ఎవరికి చెప్పవద్దని, సైబర్ నేరాలపై విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, ఓటీటీ ఫ్రాడ్స్, లోన్ యాప్స్ వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ స్రవంతి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులకు షోకాజ్ నోటీసులు



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం ఖాతాలో రూ.10 కోట్ల 54 లక్షల ఇన్‌బ్యాలెన్స్ ఉండడంతో బుధవారం హనుమకొండ జిల్లా డీసీఓ సంజీవరెడ్డి శాయంపేట పీఏసీఎస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులకు నిర్లక్ష్యం ఉందని, విధులను సరిగా నిర్వహించడం లేదని, ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు కారణాలు ఉన్నాయని పాలకవర్గ సభ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో ఏడు రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నడికూడ : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి నరేష్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ కలహాలతో నరేష్ భార్య మౌనిక (28) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

‘శ్రీవాణిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే’

పరకాల : మల్లక్‌పేట రెసిడెన్షియల్‌లో చదువుతున్న బాలిక శ్రీవాణి ఆత్మహత్య చేసుకోలేదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం శ్రీవాణి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్‌తో ఫోన్లో బాలిక మృతిపై న్యాయవిచారణ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా వరిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బీజేపీ నాయకుల పరామర్శ

శ్రీవాణి కుటుంబ సభ్యులను బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావుతో పాటు మండల నాయకులు బుధవారం పరామర్శించారు. ఆత్మహత్యపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్మసాగర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల మాజీ సర్పంచ్ తోట స్రవంతి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. స్రవంతి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐనవోలులో కేఆర్..

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ తండ్రి వీరస్వామి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. వీరస్వామి మృతదేహానికి పూలుమాల వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని హౌజ్‌బుజుర్గులో అనారోగ్యంతో మృతిచెందిన పాండవుల జ్యోతి మృతదేహానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

విద్యుత్ కాపర్‌వైర్ల చోరీ

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెంలో విద్యుత్ కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకిరువైపులా వ్యవసాయ బోరు, బావులే టార్గెట్‌గా విద్యుత్ వైర్లు దొంగిలిస్తున్నారని తెలిపారు. స్టార్టర్ నుంచి మోటర్‌కు వెళ్లే ఖరీదైన వైరును దొంగిలిస్తున్నట్లు రైతులు వాపోయారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

పగలు పార్కింగ్.. రాత్రి సిట్టింగ్



అసంపూర్తిగా నిలిచిపోయిన బస్టాండ్ నిర్మాణం



బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

- నిధుల లేమితో నిలిచిన బస్టాండ్ నిర్మాణం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారిన పరిస్థితి
- దృష్టిసారించని పాలకులు, అధికారులు

కమలాపూర్ : ఒకప్పటి నియోజకవర్గ కేంద్రం కమలాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామంటూ దశాబ్దాల కాలంగా పాలకులు, సర్వేల పేరిట అప్పుడప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేయడం తప్ప ఇప్పటి వరకు బస్టాండ్ మాత్రం నిర్మించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.71 కోట్లు మంజూరు కాగా ఆ నిధులు బస్టాండ్ నిర్మాణానికి ఏ మాత్రం సరిపోలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మంజూరైన నిధుల వరకే పనులు చేసి చేతులెత్తేశాడు. దీంతో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్టాండ్ వెక్కిరిస్తోంది. కమలాపూర్ నుంచి హనుమకొండ, హుజూరాబాద్, పరకాల, జమ్మికుంట తదితర పట్టణాలకు నిత్యం వందలాది మంది విద్యార్థులు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి ఆర్టీసీకి భారీగానే ఆదాయం సమకూరుతుంది. అయినా బస్టాండ్ నిర్మించకుండా ఆర్టీసీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మంత్రులైనా నెరవేరని కల

ఇక్కడి నుంచి ప్రాతినిత్యం వహించిన ప్రజాప్రతినిధులంతా ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన వారేనని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మూడు సార్లు మంత్రి పదవులు చేపట్టిన ముద్దసాని దామోదర్‌రెడ్డి ఒకసారి రాష్ట్ర కేబీనెట్‌లో రవాణా శాఖ మంత్రిగా, ఆ తర్వాత స్థానికుడైన ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ప్రస్తుత హు జూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గతంలో ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా కూడా పనిచేశారు. అయినప్పటికీ ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నా యి.

నిర్మాణానికి నిధుల దెబ్బ

అన్ని అడ్డంకులు అధిగమించి ఎట్టకేలకు కమలాపూర్ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.71 కోట్లు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టి మంజూరైన నిధుల వరకు పనులు చేపట్టి ఆ తర్వాత నిధులు లేవని బస్టాండ్ నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశాడు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

అసాంఘిక పనులు

అసంపూర్తిగా నిలిచిపోయిన బస్టాండ్ ప్రస్తుతం పగటి పూట వాహనాల పార్కింగ్‌కు, పంచాయతీలకు, చీకటి పడితే మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

దుకాణాలే దిక్కు

ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండకైనా, వానకైనా రోడ్ల మీద, దుకాణాల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. దుకాణాదారులు తమ షాపులకు కొనుగోలుదారులు ఎవరూ రావడం లేదంటూ ప్రయాణికులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



కమలాపూర్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి ఆర్టీసీకి ఆదాయం భారీగానే సమకూరుతుంది. నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసి త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

\- తూర్పాటి ఉపేందర్, ఉప్పల్

ఎమ్మెల్యే, మంత్రి స్పందించాలి



కమలాపూర్‌లో దశాబ్దాల కాలంగా ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిసి సంబరపడ్డాం. కానీ ఆ నిధులు సరిపడక నిలిచిపోయింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్పందించి బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

\- గోపు ఐలుమల్లు, కమలాపూర్

ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి



చెక్కులందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డలకు వరంగా మారిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా దరఖాస్తు చేసుకున్న 3 నుంచి 4నెలల్లోనే లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు తెలిపారు. గత పాలకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలు, వేల కోట్ల ఆస్తులు కూడగట్టుకున్నారని ఆరోపించారు. అనంతరం క్యాతంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన ఇంటింటికి వెళ్లి స్వయంగా పరిశీలించారు. కొన్ని ఇళ్లకు సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు రావడం లేదని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు బిల్లులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్, సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు.

పాఠశాల ఎదుట భూ నిర్వాసితుల ఆందోళన



పాఠశాల గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాల కోసం తమ ఇళ్ల, ఇళ్ల స్థలాలు తీసుకున్నారని ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి అయినా ఇచ్చి ఇల్లు కట్టించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసితులు ప్రభుత్వ పాఠశాల గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ ఘటన కమలాపూర్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. భూ నిర్వాసితులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు తొమ్మిదేళ్ల క్రితం (2016లో) కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పునర్నిర్మాణ సమయంలో ప్రభుత్వం తరుపున తమ భూములు (ఇళ్ల స్థలాలు) అడిగారని, తీసుకున్న భూమికి రెట్టింపు భూమితోపాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని, అర్హులకు పాఠశాలలో స్వీపర్ పోస్టు ఇప్పిస్తామని అప్పటి రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారన్నారు. దీంతో తోట రాజు 2 గుంటలు, మారం ఎల్లమ్మ 3 గుంటలు, కొడారి మల్లయ్య 2 గుంటలు, శానభక్తుల జ్యోతి ఇంటితో పాటు 3 గుంటల స్థలాన్ని అప్పగించినట్లు తెలిపారు. తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటి వరకు తమకు భూమి ఇవ్వలేదని, ఇల్లు కట్టించి ఇవ్వలేదని, చివరకు స్వీపర్ పోస్టు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. చెప్పులు అరిగేలా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, తహసీల్దార్ తదితర అధికారుల చుట్టూ తిరిగి కాళ్లావేళ్లా పడ్డా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే తాము తట్టా బుట్టా సర్దుకొని వచ్చి పాఠశాలలో బైఠాయించి ఆందోళనకు దిగామని తెలిపారు. ఉచితంగా భూమి ఇవ్వమనడం లేదని, తమ దగ్గర తీసుకున్న భూమికి ఇచ్చిన మాట ప్రకారం భూమి ఇచ్చి ఇల్లు కట్టివ్వాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు. అప్పటివరకు ఇక్కడే ఉంటామని భీష్మించారు. స్కూల్ గేట్‌కు అడ్డుగా ఉండి విద్యార్థులను తరగతి గదుల్లోకి వెళ్లనివ్వకపోవడంతో విద్యార్థులు వరండాల్లోనే కూర్చున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సీఐ రమ్మంటున్నాడని, న్యాయం చేస్తామని బాధితులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరుగకపోతే పాఠశాలకు తాళం వేసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న సుధాకర్ తదితరులు

ఐనవోలు : మహిళలు ఆర్థికంగా ఎదగాలని సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్ సూచించారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో బుధవారం టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సరిఫికెట్లను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మూడు నెలలుగా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ కల్పించామన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబానికి అండగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు. గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, టీచర్ స్వప్న, నిర్మల, నాయకులు మహ్మద్‌పాషా, కుమారస్వామి, మహిళలు మౌనిక, సరోజన పాల్గొన్నారు.

రూ.33కోట్ల రుణమాఫీ హర్షణీయం

శాయంపేట : చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్ల రుణమాఫీ చేయడం సంతోషకరమని మినిమం వేజేస్ బోర్డు రాష్ట్ర సభ్యుడు బాసాని చంద్రప్రకాశ్ తెలిపారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికులకు అండగా కొత్త రుణాలను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎస్సై అశోక్



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండల కేంద్రం శివారులోని ఏకశిల పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. గుట్కా, గంజాయి, మద్యం వంటి వ్యసనాల వలన యువత చెడిపోతుందని అన్నారు. చెడు స్నేహాలకు విద్యార్థి దశలోనే దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగిఉండాలని అన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం అదించాలని వెల్లడించారు. కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాల డైరక్టర్ బేతి కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ గోకుల్, వైస్ ప్రిన్సిపాల్ దీప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి విరాళం



కమలాపూర్ : మండలంలోని భీంపల్లిలో గల రేణుకాఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాయినేని తిరుపతిరావు, మాజీ జెడ్పీటీసీలు నవీన్‌కుమార్, లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా బుధవారం గౌడ సంఘం నాయకులకు అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రావు, రాజమౌళి, ఖాజాహుసనోద్దీన్, శ్రీధర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ మహాసభకు తరలిరావాలి

ఐనవోలు : కాజీపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్లో రేపు నిర్వహించనున్న జీఎంపీఎస్ మహాసభలకు తరలిరావాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు పిడుగు దయాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గొల్ల, కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్నరాజు, సొసైటీ అధ్యక్షుడు ఉడుత చేరాలు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సమ్మయ్య, రాజు, యాదయ్య, చంద్రు, సమ్మయ్య, యాకయ్య, చంద్రయ్య, సోమయ్య, చిన్న పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ఎమ్మార్పీస్ జెండా ఎగురాలి

శాయంపేట : మండలంలోని ప్రతి గ్రామంలో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జ్ మామిడి భాస్కర్ ఆధ్వర్యంలో జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. మూడు దశాబ్దాల ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధించినట్లు తెలిపారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగా వైభవంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్, ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్కెర ముఖేష్, వెంకటేష్, దేవయ్య, చిరంజీవి, సాంబయ్య, కృష్ణమూర్తి, మోహన్, కరణ్‌బాబు, క్రాంతికుమార్, పాపయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కారకులపై చర్య తీసుకోవాలి

పరకాల : మండలంలోని మల్లక్‌పేట సోషల్ వేల్ఫేర్ గురుకులంలో పదో తరగతి విద్యార్థిని శ్రీవాణి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్‌లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని మూడు రోజులవుతున్నా ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతోనే గురుకులాలపై పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్‌లో నాణ్యత లేని భోజనాలు వడ్డించడంతో పాటు మౌళిక సదుపాయాలు కరువై విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్ నాయకులు నందు విజయ్, పీటర్, గోవిందు, బన్నీ, సాయి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



గ్రామపంచాయతీలో మొక్కల పంపిణీని ప్రారంభిస్తున్న అధికారులు

నడికూడ : మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్, ఎంపీడీఓ విమల అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నడికూడ మండలంలోని కంఠాత్మకూరు గ్రామపంచాయతీలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కల నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి, ఏపీఓ విద్యావతి, పంచాయతీ కార్యదర్శి భార్గవి, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్స్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



శాయంపేట : పత్తిపాక గ్రామానికి చెందిన వీరగాని రంజిత్ తండ్రి పాపయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రంజిత్‌తో పదో తరగతి చదువుకున్న స్నేహితులు క్వింటాల్ బియ్యం అందించి చేయూతనిచ్చారు. వేణు, చెన్న శ్రీధర్, నసిరొద్దీన్, సాదిక్, హైమా, కవిత, ఓంకార్, సదయ్య, కుమారస్వామి ఉన్నారు.

పల్లెల్లో బోనాల సందడి



ఆత్మకూరు : పెద్దమ్మతల్లి ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లికి బుధవారం బోనాలు సమర్పించారు. ముదిరాజ్ ఆడపడుచులు డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్స్ నడుమ బోనాలు సమర్పించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి గ్రామస్తులను ఆయురారోగ్యాలతో చూడాలని వేడుకున్నట్లు చెప్పారు. పాడి పంటలు బాగా పండాలని, గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోరే రాజయ్య, మోరే శ్రీను, కురాకుల రాజు, సామంతుల సురేష్, బల్ల శ్రీను, కురాకుల సంతోష్, మోరే శ్యాంసుందర్, శ్రీపాల్, పైడి పాల్గొన్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో..

పెద్దకోడెపాక గ్రామంలో కురుమ కులస్తులు బుధవారం బీరన్న బోనాలను డప్పు చప్పుళ్ల నడుమ బోనాలు సమర్పించారు. పొడెళ్లను నైవేద్యంగా సమర్పించారు. భారత జాగృతీ యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్, అమ్మ రవి, రమేశ్, రాజు, వేణు, రంజిత్, అశోక్, శివ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లి బోనాలను వైభవంగా జరుపుకొన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుష్మా

పరకాల : పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మమత నగర్‌లో ఆమె పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షకాలం సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉండటంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహారించకుండా విధులను బాధ్యతయుతంగా చేపట్టాలని అన్నారు. మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజల సహాకారం ఉండాలని కోరారు. ప్రజలు సైతం తమ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పడేయకుండా సహకరించాలని కోరారు. అందరూ సహకరిస్తేనే పట్టణాన్ని సుందరీకణంగా తీర్చిదిద్దగలమని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉండాలన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



ధర్మసాగర్ : మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జ్ గంగారపు శ్రీనివాస్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా మంద ఆరోగ్యం, తాటికాయల కొమురయ్య, అధ్యక్షుడిగా తాటికాయల అశోక్, అధికార ప్రతినిధిగా శంకర్, ఉపాధ్యక్షులుగా సురేష్, అనిల్, యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, ప్రచార కార్యదర్శిగా సురేందర్, కోశాధికారిగా రవితేజ, కార్యదర్శిగా కనుకయ్య, సహాయ కార్యదర్శిగా ఏలియా, సలహాదారులుగా సుధాకర్, కుమారస్వామి, శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సందీప్, అధికార ప్రతినిధిగా శ్రవణ్, ఉపాధ్యక్షులుగా రాకేష్, మనోజ్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, ప్రచార కార్యదర్శిగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా శాంసన్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.